ప్రతి గడపకూ సంక్షేమం

వలంటీర్లకు సత్కార సభలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఎంపీడీవో కార్యాలయంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశలు, ఆశయాలను నిలబెట్టేలా వలంటీర్లు పని చేస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని వలంటీర్లకు బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో మండలంలోని వలంటీర్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులను అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా ఉంటే నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గడపను పలుకరిస్తున్నాయన్నారు.

వలంటీర్ వ్యవస్థను విమర్శించినవారే..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు లక్షల కుటుంబాలలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నాయని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థను కించపరిచేలా మాట్లాడిన వారే నేడు 50 ఇళ్లకు కాదు 25 ఇళ్లకు ఒక వలంటీర్‌ను పెడతామని చెబుతున్నారని తెలిపారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. వలంటీర్లు ఇక నుంచి ప్రజలకు మరింత మేలైన సేవలందించేలా కృషి చేయాలని జగన్‌మోహనరావు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు పాకాలపాటి కిరణ్, ఓర్సు లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ కమిషనర్ హేమమాలిని, ఏఈ ఫణి శ్రీనివాస్, ఎంపీపీ ఆకుల హనుమంతరావు, వైస్ ఎంపీపీ అన్నం పిచ్చయ్య, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, రామిరెడ్డి సీతయ్య, బండారు వెంకట్రావ్, షేక్ జాఫర్, బాపట్ల సాంబయ్య, మంద మరియమ్మ, బండారు గంగమ్మ, మన్నెం దాసు, మాడుగుల మనోహర్, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో వలంటీర్‌లు పాల్గొన్నారు.

రూ.2.44 కోట్లతో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

చందర్లపాడు(నందిగామ టౌన్): జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ మంచి నీటి కుళాయి అందిస్తామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని చందాపురం గ్రామంలో చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలో రూ.2.84 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా చేపడుతున్న ఇంటింటికీ కుళాయి, పైప్‌లైన్ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ చందాపురం గ్రామంలో రూ.44 లక్షలతో పనులు చేపడుతుండగా తుర్లపాడు గ్రామంలో రూ.2.40 కోట్లతో పైప్‌లైన్ పనులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికీ సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో తాగు, వాడుక నీటి ఎద్దడి లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేయటంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, నాయకులు పెరమసాని నరసింహారావు, చిరుమామిళ్ల కిరణ్, అరిగెల సుందరమ్మ, వైఎస్ఎస్ ప్రసాద్, పారుపల్లి హరిబాబు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు
- మోగులూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మోగులూరులో పూజారికి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

మోగులూరు(కంచికచర్ల): నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి చేశాం కాబట్టే గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటున్నామని, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి తెలియజేస్తున్నామని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. మోగులూరు గ్రామంలో ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం రెండవరోజు మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరును అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తున్న ఏకైక ప్రభుత్వం సీఎం జగన్ ప్రభుత్వమన్నారు. ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడం, లబ్ధిదారులందరికీ క్రమం తప్పకుండా ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ, అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని పరిష్కరించాలని మహిళలు కోరారు. త్వరలోనే జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామంలోని ప్రజలందరికీ తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్ ఎంపీపీ బండి మల్లిఖార్జునరావు, సొసైటీ అధ్యక్షుడు బండి జానకీరామయ్య, సర్పంచి షేక్ మొహిద్దీన్ బీ, ఎంపీటీసీ సభ్యులు ఆవల సామ్రాజ్యం, గ్రామ పార్టీ కన్వీనర్ బండి సూరిబాబు, మాజీ సర్పంచి షేక్ హుస్సేన్, బండి తిరుపతిరావు, రాయల నరహరి, షేక్ రసూల్, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వో శ్రీలక్ష్మి, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కళ్యాణ వేదిక ప్రదేశంలో శుద్ధి పూజలు



శుద్ధి పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్, పాలకవర్గ సభ్యులు

పెనుగంచిప్రోలు: ఈనెల 23న నిర్వహించే శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారి కల్యాణానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్న కల్యాణ వేదిక ప్రదేశంలో మంగళవారం ఆలయ వేద పండితులు, ఆలయ పురోహితులు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో స్థల శుద్ధి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, మహా గణపతిపూజ, స్వస్తి పుణ్యావహచనం, మండప ఆరాధనలు, మూలమంత్ర జపాలు, లక్ష్మీగణపతి హోమం, వాస్తుహోమం, సుదర్శనహోమం, నవగ్రహ హోమం, చండీమూలమంత్ర పుష్పం, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు పాలాది వెంకటరమణ, బెజవాడ శ్రీనివాసరావు, వీర్ల రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

252 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పాండురరంగారావు, సర్పంచ్ వెంకటేశ్వర్లు

అన్నవరం(జగ్గయ్యపేట): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి ప్రవంతి పేర్కొన్నారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ మీగడ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం వైద్యులు 252 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ప్రవీణ్ కార్డియాక్ వైద్యుడు పాండురంగారావు, గైనకాలజిస్ట్ తేజ్, సూపర్‌వైజర్ వెంకట్రావ్, ఏఎన్ఎం త్రివేణి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

103 మందికి వైద్య పరీక్షలు

నందిగామ: మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ పి.అరుణకుమారి ప్రారంభించారు. వైద్యులు స్వప్నలత, రమ్య గ్రామానికి చెందిన 103కి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

బోరుపంపునకు మరమ్మతుల నిర్వహణ



బోరు పంపును బాగు చేయిస్తున్న సర్పంచి రవికుమార్

కంచికచర్ల: వేసవిలో గ్రామంలో అన్ని వీధులకు రక్షిత తాగునీటిని సరఫరా చేస్తామని సర్పంచి బొక్కా రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లి రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న కీసర మున్నేటిపై ఏర్పాటు చేసిన బోరు పంపు మరమ్మతు పనులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఏళ్ల తరబడి తాగునీరు సరఫరా కాని ఇళ్లను గుర్తించి వారికి ప్రతిరోజు తాగునీరు సరఫరా అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో డ్రెయినేజీల్లో మురుగునీరు పారుదల కోసం శానిటేషన్ పనులు చేపట్టామని సర్పంచి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న పరమేశ్వరరెడ్డి

జి.కొండూరు: ప్రస్తుత కాలంలో మామిడిలో వచ్చే తేనె మంచు పురుగు, తామర పురుగుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఉద్యాన శాఖాధికారి పరమేశ్వరరెడ్డి అన్నారు. ఆత్కూరు గ్రామంలో రైతు నూతక్కి రాంప్రసాద్‌కు చెందిన మామిడితోటలో రైతులకు యాజమాన్య పద్ధతులపై అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. తేనెమంచు పురుగు, తామర పురుగు నివారణకు చేపట్టవలసిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులుంటే తెలియజేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

తిరువూరు: ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులుంటే తమకు తెలియజేయాలని తిరువూరు ఆర్డీఓ మాధవి కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఓటర్ల చిరునామా, పేర్లు ఇతర వివరాలను ఇప్పటికే బీఎల్‌ఓలు సమగ్రంగా పరిశీలించి సవరించారని, పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వైఎస్సార్ సీపీ, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేగవంతంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): నవరత్నాలు పథకంలో భాగంగా పేదలకు అందించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగంగా జరుగుతున్నాయి. సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు. అనిగండ్లపాడు గ్రామంలో మంగళవారం నాటికి 228 పట్టాలకు గాను 102 రిజిస్ట్రేషన్లు పూర్తి అయినట్లు సచివాలయ కార్యదర్శి హలీమ్ తెలిపారు. ఈకార్యక్రమంలో వీఆర్‌వో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేత



పెనుగంచిప్రోలు: విధి నిర్వహణలో ప్రతిభ చూపిన సిబ్బందికి మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ నగదు రివార్డులు అందజేశారు. ఇటీవలన జరిగిన హత్య కేసులో నిందితుడిని వెంటనే పట్టుకోవటంలో ప్రతిభ చూపిన వత్సవాయి ఎస్ఐ అభిమన్యు, కానిస్టేబుళ్లు సురేష్, లక్ష్మీనారాయణలకు రివార్డులు అందజేశారు. అత్యధిక కోర్టు కేసుల పరిష్కారం, పలు కేసుల్లో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ నాగేశ్వరరావుకు రివార్డు అందజేశారు. అనంతరం శ్రీతిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవాలకు సంబంధించి ఆలయం వద్ద పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, పెనుగంచిప్రోలు ఎస్ఐ పి.రాంబాబు పాల్గొన్నారు.

స్వాగత ద్వారాల ఏర్పాటు



వత్సవాయి: పెనుగంచిప్రోలు శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయ పెద్ద తిరునాళ్లను పురస్కరించుకుని భక్తుల రాకకై తిరుపతమ్మ అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో స్వాగతద్వారాలను ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం, ముక్లపాడు క్రాస్ రోడ్, చిల్లకల్లు, మక్కపేట, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా బోనకల్ వద్ద వీటిని ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది పెద్ద తిరునాళ్ల, చిన్న తిరునాళ్లకు వీటిని ఏర్పాటు చేస్తారు. లక్షలు వెచ్చించి తాత్కాలిక ఆర్చీలు నిర్మాణం చేసే బదులు శ్వాశత నిర్మాణాలు చేపడితే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



నందిగామ: స్థానిక రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. పండితుల ఆధ్వర్యంలో పలు హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం వేళ పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రాత్రి సమయంలో స్వామి వారిని అశ్వవాహనంపై ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై అవగాహన ఉండాలి



గరికపాడు(జగ్గయ్యపేట): విద్యార్థులు చదువుతో పాటు వ్యవసాయ రంగంపై కూడా అవగాహన కలిగి ఉండాలని కేవీకే కో ఆర్డినేటర్ కృష్ణం రాజు పేర్కొన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని తపోవన్ పాఠశాల 8, 9 తరగతుల విద్యార్థులు మంగళవారం కేవీకేలో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పుట్టగొడుగుల పెంపకం, పౌష్టికాహారం ఆవశ్యకత, మొక్కల పెంపకంతో పాటు మట్టి నమూనా పరీక్షలు వంటి వ్యవసాయ అనుబంధ అంశాలను శాస్త్రవేత్తలు వివరించారు. కేవీకే కో ఆర్డినేటర్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతుల్లో చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధీర్, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పన పనులు ముమ్మరం





పేటలోని బలుసుపాడు రోడ్డులో టిడ్కో గృహాల వద్ద నిర్వహిస్తున్న పనులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో ఉన్న టిడ్కో గృహ సముదాయంలో మౌలిక సదుపాయాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సబ్ స్టేషన్, కరెంట్ పోల్స్ ఇతర విద్యుత్ పనులు, ఫ్లోరింగ్‌కు సంబంధించి టైల్స్ ఏర్పాటు తదితర పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

గత పాలకుల నిర్లక్ష్యం వలనే జాప్యం..

టిడ్కో గృహాలు ఇప్పటి వరకు లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడానికి కారణం గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యమే కారణం. టిడ్కో గృహాల కోసం భూములు ఇచ్చిన రైతులకు, గృహాల నిర్మాణ సంస్థ అయిన ఎల్‌అండ్ టీ సంస్థకు సకాలంలో డబ్బులు చెల్లించలేదు. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో జాప్యం జరుగుతూ వచ్చింది. ఇప్పుడు సమస్యను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి భూయజమానులకు రూ.3.5 కోట్లు, ఎల్‌అండ్‌టీ నిర్మాణ సంస్థకు రూ.45 కోట్ల బకాయిలను చెల్లింపజేశారు. దీంతో గృహాలు లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి అవరోధాలు తొలగిపోయాయి. తదనంతరం టిడ్కో గృహ సముదాయంలో మిగిలిపోయిన పనులను యుద్ధప్రాతిపదికన చేయిస్తున్నారు. ఈ పనులు కూడా మరికొద్ది రోజుల్లో పూర్తి చేసి త్వరలో పంపిణీ చేయనున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వీరులపాడు: పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించాలని తహసీల్దార్ రాజకిషోర్ పేర్కొన్నారు. మండలంలోని జయంతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలన్నారు. తాగునీరు, వెలుతురు, తదితర మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. డీటీ ఆంజనేయులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా జీవ ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం

వీఅన్నవరం(వీరులపాడు): మండలంలోని వీఅన్నవరం గ్రామంలో ఆంజనేయ స్వామి జీవధ్వజ పునఃప్రతిష్టా కార్యక్రమాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మంగళవారం గణపతిపూజ,శాంతి పఠనం, వేదపారాయణ, పుణ్యాహవచనం కార్యక్రమాలను నిర్వహించారు. జీవధ్వజ స్తంభానికి గ్రామస్తులు పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వల్లాపురి రామ కోటేశ్వరరావు, సర్పంచ్ జమ్ముల వరబాబు, మాజీ సర్పంచ్ శేషగిరిరావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

22న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

తిరువూరు: తిరువూరు నుంచి తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసును ఈ నెల 22న నడుపుతామని తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వేణు తెలిపారు. 22న సాయంత్రం 4 గంటలకు తిరువూరు నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం మీదుగా శుక్రవారం రాత్రి అరుణాచలం పుణ్యక్షేత్రానికి చేరుతుందన్నారు. గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం 24న తిరుగు ప్రయాణంలో కంచి, తిరుత్తణి, శ్రీకాళహస్తి మీదుగా ఆదివారం రాత్రికి తిరువూరు చేరుతుందని తెలిపారు. అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ కోసం సెల్: 98856 61835 నంబరును సంప్రదించాలని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్ : పేట మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు జరుగు ఈ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి జగ్గయ్యపేట పురపాలక సంఘం తయారు చేయబడిన బడ్జెట్ అంచనాలు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు, ఇతర అజెండాను కౌన్సిల్ సిద్ధం చేసినట్లు తెలిపారు.

వలంటీర్ల సేవలకు సత్కారం

- నేడు కంచికచర్లలో కార్యక్రమం
- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు చేతులమీదుగా అవార్డుల ప్రదానం

కంచికచర్ల: మండలంలో పనిచేస్తున్న వలంటీర్లను బుధవారం సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేయనున్నారు. ప్రభుత్వం ప్రతి ఏడాది పురస్కారాలతో సత్కరిస్తూ వలంటీర్లలో నూతన ఉత్సాహం నింపుతోంది. మండలంలో ఐదుగురికి సేవా రత్న, 337 మందికి సేవా మిత్ర పురస్కారాలను అందించనున్నారు.

సేవలకు గుర్తింపు..

కంచికచర్ల మండలంలో 17 గ్రామ సచివాలయాల పరిధిలో 390 మంది వలంటీర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఐదుగురికి సేవా రత్న, 337 మంది వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికయ్యారు. మండలంలో పరిటాల-1లో నెమలపురి వరలక్ష్మి, కంచికచర్ల-3లో జోలు స్వప్న, మోగులూరులో ధర్మవరపు సాయి, కంచికచర్ల-2లో కోనాల దుండీ, గనిఆత్కూరులో దగ్గుపాటి నరేంద్రలకు సేవా రత్న అవార్డులు వచ్చాయి. అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు చేతులమీదుగా అందించనున్నారు.


ప్రజా సేవ సంతృప్తినిస్తోంది..



ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు చేరవేయటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయటం సంతృప్తి నిస్తోంది. నా పరిధిలో అర్హులందరికీ పథకాలు సక్రమంగా అందించేందుకు కృషి చేస్తున్నాను. సేవ చేయటంలోనే ఆత్మ సంతృప్తి.

–మందా బాబు, సేవామిత్ర, గ్రామ సచివాలయం, కొత్తపేట

సంతోషంగా ఉంది..



నా పరిధిలోని ఉన్న కుటుంబాలకు సేవలందించటం సంతోషంగా ఉంది. ప్రతి నెలా ఒకటోవ తేదీన తెల్లవారుజామున పింఛన్ ఇచ్చేందుకు వెళ్లినప్పుడు లబ్ధిదారుల సంతోషం చూసి చాలా సంతృప్తి నిస్తోంది. మా కష్టాన్ని గుర్తించి అవార్డులతో ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావుకు ప్రత్యేక అభినందనలు.

–కోనాల దూండీ, సేవా రత్న, కంచికచర్ల గ్రామ సచివాలయం-2

కష్టపడే వారికి గుర్తింపు..

కష్టపడే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయటం, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని కేటాయించిన కుటుంబాలకు తెలియజేసి అర్హులుంటే అర్జీలు తీసుకుని మంజూరు చేయటంతో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. కష్టానికి ప్రభుత్వం గుర్తింపు నివ్వటం వలంటీర్లకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది.

–ఏ దీప్తి, ఎంపీడీఓ, కంచికచర్ల

సేవా కార్యక్రమాల్లో పోటీ పడాలి



తిరువూరు వాసవీ, అనుబంధ క్లబ్‌ల సభ్యుల ప్రమాణ స్వీకారం

తిరువూరు: వాసవీ క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో పోటీ పడాలని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ సతీష్ అన్నారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో మంగళవారం వాసవీ, వనిత, యూత్, సీనియర్ సిటిజన్, కపుల్ క్లబ్‌లకు కొత్త కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సతీష్ మాట్లాడుతూ పేదలకు సాధ్యమైనంత ఎక్కువగా సహాయపడే విధంగా కార్యక్రమాలను రూపొందించుకోవాలన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా నాళ్ల కృష్ణారావు, వనిత క్లబ్‌కు రాయల చంద్రకళ, యూత్ క్లబ్‌కు దారా దిలీప్, కపుల్స్ క్లబ్‌కు దారా శ్రీనివాసరావు, సీనియర్ సిటిజన్ క్లబ్‌కు నాళ్లా సూర్యప్రకాశరావులు అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ జిల్లా, జోనల్ సభ్యులు పాల్గొన్నారు.

23న కల్యాణ మహోత్సవం

మైలవరం: మైలవరం మండలం బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ, గోపయ్యస్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఈ నెల 23న రాత్రి 9.26 గంటలకు జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణ కార్యదర్శి ఎన్‌వీ సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పూజారి జాజుల తిరుపతమ్మ దంపతులతో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ చెలికాని సత్యవర ప్రసాద్ దంపతులచే కల్యాణం వైభవంగా నిర్వహిస్తామని వివరించారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

తిరువూరు: స్థానిక తోకపల్లి సెంటర్లో గత శనివారం అర్ధరాత్రి ముగ్గురు యువకులపై కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేసిన నిందితులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మాటామాటా పెరిగి తిరువూరుకు చెందిన యువకులు ఆరిఫ్, సయ్యద్, అఫ్రోజ్‌లపై శ్రీకాకుళపు మహేశ్వరరావు, రమేష్‌చారి, ఉడతా నరసింహం దాడి చేసి కత్తులతో పొడిచినట్లు కేసు నమోదు చేసి నిందితులను స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

లక్ష తులసీ దళార్చన

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినోత్సవం సందర్భంగా స్వామికి లక్ష తులసీదళార్చనను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు అర్చక బృందం అర్చనలు, శ్రీ కృష్ణ తారక మహా హోమం, శాంతి హోమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ సహాయ కమిషనర్ ఎస్.వెంకట సాంబశివరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు. గంపలగూడెం సీతరామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు దేవయనిజం శ్రీధరాచార్యులు విష్ణు సహస్రనామ పారాయణం రామానుజ అష్టోత్తరం జరిపారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.